# ఆంధ్రుల అన్నయ్య అన్నమయ్య

- అపర్ణ యేలూరిపాటి, Bridgewater, NJ

ఇంతమంది తెలుగు తల్లులున్నారు. "జో అచ్యుతానంద! జోజో ముకుందా! రావె పరమానంద రామ గోవిందా!" అనే పాటతో తమ పిల్లలను జోకొడుతూ నిద్రపుచ్చలేదని ఎవ్వరైనా చెప్పగలరా! ఇంతమంది తెలుగు పిల్లలున్నారు. ఎవ్వరైనా "చందమామ రావె, జాబిల్లి రావె" అనే పాటను పాడుతూ అమ్మ తనకు గోరుముద్దలు తినిపించలేదని అనగలరా? అన్నమయ్య పాటలకు జనసామాన్యంలో ఉన్న ప్రాచుర్యానికి ఇదే నిదర్శనం.

పాటను రాసిన రచయిత ఎవరో తెలియకపోయినా, విన్నవాళ్ళు ఆయా పాటల్ని అలవోకగా పాడుకోవటం అన్నమయ్య సాహిత్యంలోని ప్రత్యేకత అయితే, పెద్దగా సంగీతజ్ఞానం లేనివాళ్ళుకూడా ఎవరైనా పాటలు పాడుతుంటే "ఒక్క అన్నమాచార్య కీర్తన పాడరా" అని తప్పనిసరిగా అడగటం ఆయన సంగీతంలోని విశిష్టత.

"అదిగో అల్లదిగో శ్రీహరివాసము -- పదివేల శేషుల పడగలమయము" అంటూ మనకు తిరుమల సందర్శనా దివ్యానుభూతిని కలిగించిన అన్నమయ్యే "కొండలలో నెలకొన్న కోనేటి రాయడువాడు -- కొండలంత వరములు గుప్పెడువాడు" అంటూ మనకు భరోసానీ కలిగించాడు.

తిరుమలగిరినాథుడు అన్నమయ్యకు ఆరాధ్య దైవం. అలమేలుమంగ ఆయనకు అతి ప్రేమాస్పదురాలైన మాతృమూర్తి. వేంకటేశ్వరుని కీర్తించటం అన్నమయ్యకు అత్యంత ప్రీతికరమైనదైతే, అలమేలుమంగను వర్ణించటమంటే ఆయన సంతోషానికి అవధే ఉండదు. వారిద్దరి సరససల్లాపాలనుంచి, అలకలు-అనునయాలుదాకా అన్నమయ్య కలానికి ఆలంబనలయ్యే అంశాలే. "ఏమొకో చిగురుట ధరముల ఎడనెడ కస్తూరి నిండెనో - భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు కదా" అనే కీర్తనలోను, "ఒకపరి కొకపరి ఒయ్యారమై, మొకమున కళలెల్ల మొలచినట్లుండె" అనే కీర్తనలోను వారి సరస శృంగారకేళిని కనులకు కట్టించాడు అన్నమయ్య.

"ఓయమ్మా ఇంతయేల ఒద్దనరే, నాయముకాదిందిరతో నగుబాటు తనకును" అనే కీర్తనలో స్వామివారి అలుకను, ఆ అలుకని తీర్చటానికి అమ్మవారు పడిన పాట్లను అందంగా వర్ణించాడు. కంటి శుక్రవారమునాడు గడియలేడింట - అంటి అలమేల్మంగ నండ నుండే స్వామి" అనేకీర్తనలో స్వామికి నలుగు పెట్టి, అమ్మవారు అభ్యంగనస్నానం చేయించిన చందాన్ని కళ్ళకు కట్టించాడు.

"చక్కని తల్లికి ఛాంగుభళా, తన చక్కెరమోవికి ఛాంగుభళా" అనీ, "అలరులు కురియగ నాడెనదే అలకల కులుకుల అలమేలుమంగా" అనీ, "క్షీరాబ్ధికన్యకకు శ్రీమహాలక్ష్మికిని నీరజాలయకును నీరాజనం" అనీ తనకు నచ్చినట్లు, తనివితీరా కీర్తించటం అన్నమయ్యకే చెల్లు.

శ్రీవేంకటేశ్వరునిపై భక్తులకుండే అపారమైన నమ్మకానికి నిదర్శనంగా ఎన్నో కీర్తనలను రచించాడు అన్నమయ్య. "ఆకటి వేళల అలపైనవేళలను తేకువ హరినామమే దిక్కు మరిలేదు" అనీ, అంతర్యామి అలసితి సొలసితి, అంతట నీ శరణిదె జొచ్చితిని" అనీ, "ఏపురాణములనెంత వెదకినా, శ్రీపతిదాసులు చెడరెన్నటికీ" అనీ, "గెలిచితి భవములు, గెలిచితి లోకము యెదిరి నీదాసుల కెదురెందేమి" అనీ శ్రీహరియొక్క ఆశ్రితపక్షపాతాన్ని విపులంగా వివరించాడు.

"అందరికాధారమైన ఆదిపురుషుడీతడు, విందై మున్నారగించె విదురుని కడనీతడు" అనే కీర్తనలో "సనకాదులు కొనియాడెడి సర్వాత్ముకుడీతడు, వనజభవాదులకును దైవంబైనతడీతడు, సిరులొసగి యశోద ఇంట శిశువైనతడీతడు, ధరనావుల మందలలో తగ చరించెనీతడు, సరసతలను గొల్లెతలకు చనవులొసగెనీతడు, అరసి కుచేలుని యటుకులు ఆరగించెనీతడు," అంటూ తన్మయత్వంతో కీర్తిస్తుంటే ఒళ్ళు పులకరించని తెలుగువారుండరంటే అతిశయోక్తి కాదు.

తల్లి ప్రేమలోని తియ్యదనాన్నంతటినీ, యశోదాకృష్ణుల పాటలలో పొందుపరచాడు అన్నమయ్య. "చిన్నిశిశువు, చిన్ని శిశువు ఎన్నడూ చూడమమ్మ ఇటువంటి శిశువు" అనీ, "చేరి యశోదకు శిశువితడు, ధారుణి బ్రహ్మకు తండ్రియు నితడు" అనీ, వేంకటగిరినాథుని పరమాత్మ తత్వాన్న తేలికపదాలలో తెలిపాడు అన్నమయ్య.

ఎంత అద్భుతమైన భావమైన అన్నమయ్య పాటలో అలవోకగా అల్లుకుపోతుంది. ఎంతటి ఆధ్యాత్మిక విషయమైనా అన్నమయ్య పదాలలో అందంగా ఒదిగిపోతుంది. "అన్ని మంత్రములు ఇందే ఆ వహించెనూ, వెన్నతో నాకు కలిగే శ్రీనివాసమంత్రమూ" అంటూ, నారదుడు జపించిన నామమంత్రం, ప్రహ్లాదుడు జపించిన నారసింహమంత్రం, విభీషణుడు జపించిన రామమంత్రం, ధృవుడు

జపించిన వాసుదేవమంత్రం, అర్జునుడు జపించిన కృష్ణమంత్రం, శుకమహర్షి పఠించిన విష్ణుమంత్రం వీటన్నింటికీ గుజి అయినది, వెన్నలవంటిది శ్రీవేంకటేశ్వరుని నామ మంత్రజపమనీ అది తనకెంతో ఇష్టమైనదనీ తెలిపాడు అన్నమయ్య.

అన్నమయ్య సంకీర్తనలు విజ్ఞానభాండాగారాలు. వాటిని వింటుంటే మనకు ఎన్నో శాస్త్రాలు, గ్రంథాలు, వేదాంతరహస్యాలు కూడా ఆకళింపుకు వస్తాయి. "అన్ని రాశుల యునికి, ఇంతి చెలువపు రాశి, కన్నె నీ రాశి కూటమి కలిగినరాశి" అనే సంకీర్తనలో ఏయే లక్షణాలు కలిగియున్నవారు (స్త్రీలు) ఏయే రాశులకు చెందుతారో వివరిస్తే, "ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు - దిద్దరాని మహిమల దేవకీసుతుడు" అనే సంకీర్తనలో ముత్యం, పగడం, కెంపు, పచ్చ, వజ్రం వంటి జాతి రత్నాల గురించిన జ్ఞానాన్ని మనకందించాడు అన్నమయ్య.

"ఇందిర వడ్డించ నింపుగను, చిందక యిట్టి భుజియించవో స్వామి" అనే కీర్తనలో అక్కాళపాళాలు, అప్పాలు, వడలు, పేణులు, చక్కెరరిసెలు, సద్యోఘృతములు, మిరియంపు తాళింపు పెట్టిన కూరలు, సారంపు పచ్చళ్ళు, పిండివంటలు, పెరుగులు, పాలు, మెరుగైన పాయసాలు, కొండల పొడవు దివ్యాన్నాలు, మెచ్చి ఆరగించమని కోరుతూ రకరకాల వంటకాల రుచులను మేళవించి వినిపించాడు అన్నమయ్య. నిజం చెప్పాలంటే అందులోని కొన్నింటి పేర్లైనా మనకు తెలియవేమో. (మాయాబజార్ సినిమాలో ఘటోత్కచుని వివాహభోజనంబు పాట వినగానే మనకు కలిగే నోరూరిన భావన ఈ కీర్తన విన్నప్పుడు కలుగుతుంది.)

"పదకవితాపితామహుడు"గా పేరుమోసిన అన్నమాచార్యుని కీర్తనలు అచ్చ తెలుగుపదాల భాండాగారాలు. "కొలనిదోపరికి గొబ్బిళ్ళో, యదుకుల స్వామికి గొబ్బిళ్ళో, కొండ గొడుగుగా గోవులగాచిన కొండొక శిశువుకు గొబ్బిళ్ళో", "చేతులెత్తి మొక్కరమ్మ, చేరి యారతెత్తరమ్మ, యేతులే బూమెల్లా నిండెనీ దేవునికీ", "బ్రహ్మ కడిగిన పాదమూ బ్రహ్మము తానెనదీ పాదమూ", "ఎండగాని నీడగాని ఏమైనా గాని, కొండలరాయడె మాకులదైవము, మాకులదైవము" అంటూ ఎన్నో వేల కీర్తనలను రచించాడు. చూడండి ఆ పదాల్లో ఎంత చక్కని తెలుగుతనమో.

శృంగారాన్ని ఎంత సులువుగా రచించాడో, వైరాగ్యాన్ని కూడా అంత వైభవంగా వర్ణించాడు అన్నమయ్య. "రాజుల్మత్తులు వారి సేవ నరకప్రాయంబు" అన్న ధూర్జటిలాగానే, అన్నమయ్య "మనుజుడై పుట్టి మనుజుని సేవించి అనుదినమును దుఃఖమందనేలా" అంటూ, మానవులను (ప్రభువులను) సేవించటం అనవసరమనీ, అందమైన వేంకటాద్రీశుని సేవించి అందరాని పదమందటమే మానవ జన్మకు పరమార్థమనీ ప్రబోధించాడు.

సంఘసంస్కారాన్ని కూడా తన కావ్యవస్తువుగా స్వీకరించాడు అన్నమయ్య. "తందనాన అహి తందనానా పురే" అనే సంకీర్తనలో "బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే" అంటూ, ఈ ప్రపంచంలో హీనము, అధికము అనేవి లేవనీ, అందరికీ శ్రీహరే అంతరాత్మ అనీ, భూమిపై నివశించే జంతుకులమంతా ఒకటే అనీ, గాలి-నీరు-భూమి-ఆకాశం-వాయువు ఈ పంచభూతాలు అందరికీ సమానమనీ, నిద్ర-ఆకలి లాంటి శారీరికధర్మాలు అందరికీ సమానమేననీ పాపులను, పుణ్యులను సరిసమానంగా కాచేది శ్రీవేంకటేశ్వరుని నామమొక్కటే ననీ వివరించాడు. "ఏకులజుడైననేమి ఎవ్వడైననేమి ఆకడ నాతడె హరి నెరిగినవాడు" అని అంటూ భగవద్భక్తులకు కులమతభేదాలుండవనీ, అందరూ ఆయనకు సమానులేననీ విశదీకరించాడు.

అచ్చపు తెలుగుమాటలలో ఎంత చక్కని సంకీర్తనలను రచించాడో, అంతే రమ్యంగా సంస్కృతంలోనూ కృతులు వెలయించాడు అన్నమయ్య. "అయమేవ అయమేవ ఆదిపురుషో, జయకరం తమహం శరణం భజామి, అయమేవ ఖలుపురా అవనీధరస్తుసో, వ్యయమేవ వటదళాగ్రాధీశయనః, అయమేవ దశవిధ్ధరవతార రూపై చ్య, నయమార్గ భూవిరక్షణ మాకరోతి--", "అస్మదాదీనాం అన్యేషాం తస్మిన్ తస్మిన్ తత్రచ పునశ్చ---", "సతతాధ్యయన నిష్ఠాపరాణాం. ధృఢవ్రతినాం యతినాం వనవాసినాం, గతిరిహ స్మర్తుం కా జగత్యాం పరిస్థితిరియం కా విష్ణుసేవా పునశ్చ----", "ఆదిపురుషా అఖిలాంతరంగా, భూదేవతా రమణ భోగీంద్రశయనా" అంటూ సంస్కృతపదసమాసభూయిష్టమైన రచనలను కూడా చేశాడు.

భక్తినీ, శృంగారాన్నీ, ఆధ్యాత్మకతనూ, వైరాగ్యాన్నీ కూడా సమపాళ్ళలో పొదిగిన అన్నమయ్య "ఎక్కడి దురవస్థలేటి దేహములోన జిక్కి జీవుడు మోక్షసిరి చెందలేడు" అనే కీర్తనలో "ఒడలు మాంసపూర మొక పూటయిన మీదు కడుగకున్న కొరగాదు, కడలేని మలమూత్ర గర్తితమిది లోను కడుగరాదు ఎంత కడిగిన పోదు, అలరు చిత్తము అతి చంచలము దీన గలసిన పెనుగాలి గనము, మెలపు లేని చిచ్చు మీద మిక్కిలి గొంత నిలుపులేదు పట్టి నిలుపగరాదు" అంటూ శరీరం

బుద్బుదప్రాయమనీ, తిరువేంకటాచలాధిపుడు నిత్యానందకరుడనీ, జీవునకు రక్షకుడనీ ఆయనను శరణుకోరాలనీ వివరించాడు.

"కటకటా దేహంబు గాసి పెట్టగ వలసె, నిటువంటి దెసలచే నిట్టుండ వలసె" అనే కీర్తనలో వార్థక్యం శరీరాన్ని బలహీన పరుస్తుందనీ, "కటకటా జీవుడా! కాలము దోలుకరాగ సటపటలచే పొద్దు గడపేవురా" అనే కీర్తనలోను "ఎక్కడి మానుషజన్మంబెత్తిన ఫలమేమున్నది నిక్కమునిన్నే నమ్మితి నీ చిత్తంబికను" అనే కీర్తనలోను మనిషి మాయలో పడి దేహంలో శక్తి ఉన్నన్నాళ్ళూ భగవంతుని తలచడనీ, అయినప్పటికీ శారీరకశక్తులు ఉడిగిన తరువాత భక్తి మార్గాశ్రయుడైనా, శ్రీవేంకటేశ్వరుడు కృపతో ఆదరిస్తాడనీ తెలియ జేశాడు.

ఆంధ్రులకు ఆరాధ్యదైవం, కలియుగ వరదుడు శ్రీ వేంకటేశ్వరుడు. ఆయనను తన జీవితంలోని ప్రతిక్షణం కీర్తిస్తూ, అమూల్య రత్నాలలాంటి 32 వేల సంకీర్తనలను తన్మయత్వంతో గానం చేసి, ఆ అపురూప సంపదను మనకు వారసత్వంగా అందజేసిన అన్నమయ్య ఆంధ్రులకు అన్నయ్య అనుకోవటంలో సందేహమే ముంటుంది. భగవద్భక్తికి తన జీవితాన్ని అంకితం చేసిన అన్నమయ్య పాటలు చదువుతూంటేనే, వింటూంటేనే మనకు ఇంత ఆనందాన్ని కలిగిస్తుంటే వాటిని కృతి చేస్తున్నప్పుడు ఆయన ఇంకెంత తన్మయుడై ఉంటాడో ఊహకు అందనిది. అది అనుభవైకవేద్యమైన, అవ్యక్తమైన అనిర్వచనీ యానుభూతి.